అత్యవసర పరిస్థితుల్లో అంతే..


పెంచికల్‌పేట్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

- 108 వాహనం లేక అవస్థలు
- ప్రైవేటు వాహనాలే దిక్కు
- అంబులెన్స్ ఏర్పాటు చేయాలని కోరుతున్న ప్రజలు

పెంచికల్‌పేట్: గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నామని ప్రభుత్వం చెబుతున్న క్షేత్రస్థాయిలో మాత్రం అందడం లేదు. మండలంలోని మారుమూల గిరిజన గ్రామాలకు అత్యవసర సమయాల్లో 108 అంబులెన్సు సైతం వెళ్లలేని పరిస్థితులు నెలకొన్నాయి. పెంచికల్‌పేట్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో 12 గ్రామ పంచాయతీలున్నాయి. వీటిలో గుండెపల్లి, కమ్మర్‌గాం, నందిగామ, మురళీగూడ, జిల్లెడ, మెరెగూడ, గొల్లవాడ, జైహింద్‌పూర్ గ్రామాలకు చెందిన ప్రజలు అత్యవసర సమయాల్లో ప్రైవేటు వాహనాలను ఆశ్రయించి వైద్యం కోసం ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని పరుగులు తీస్తున్నారు.

అంబులెన్స్ లేక పోవడంతో..

పెంచికల్‌పేట్ మండలానికి 108 అంబులెన్స్ లేకపోవడంతో అత్యవసర సమయాల్లో బెజ్జూర్, దహేగాం మండలాలకు చెందిన అంబులెన్స్‌లు పెంచికల్‌పేట్ మండలంలో సేవలందిస్తున్నాయి. అత్యవసర పరిస్థితుల్లో 108 అంబులెన్స్‌లు బిజీగా ఉండడంతో ప్రజలు ప్రైవేటు వాహనాలను ఆశ్రయించి పట్టణాలకు పరుగులు తీస్తున్నారు. కమ్మర్‌గాం వద్ద బొలెరో వాహనం బోల్తా పడిన సంఘటనలో 5 గురు గ్రామస్తులు గాయపడ్డారు. కాగా 108 అందుబాటులో లేకపోవడంతో ప్రైవేటు వాహనంలో కాగజ్‌నగర్ పట్టణానికి వైద్యం కోసం తరలించారు. మెరెగూడ గ్రామానికి చెందిన గర్భిణి పురిటి నొప్పులతో బాధపడుతుండగా ఎడ్ల బండ్ల ద్వారా మండల కేంద్రానికి రాగా కడుపులోని శిశువు చనిపోయింది. ఇలాంటి ఘటనలు గిరిజన గ్రామాల్లో అనేకం చోటు చేసుకున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి మండలానికి 108 అంబులెన్స్ కేటాయించాలని ప్రజలు కోరుతున్నారు.

108 ఏర్పాటు చేయాలి



మండల కేంద్రంలో 108 అంబులెన్స్ లేకపోవడంతో అత్యవసర సమయాల్లో, ప్రమాదాలు జరిగినప్పుడు ఇబ్బంది పడుతున్నాం. ప్రభుత్వం స్పందించి పెంచికల్‌పేట్ మండలానికి నూతన 108 అంబులెన్స్ ఏర్పాటు చేయాలి.

– ఉపాసీ వెంకటేశ్, పెంచికల్‌పేట్

ప్రైవేట్ వాహనాల్లోనే ప్రయాణం



ప్రమాదాలు జరిగినప్పుడు దహెగాం, బెజ్జూర్ మండలాలకు చెందిన అంబులెన్స్‌లకు సమాచారం అందిస్తున్నాం. 108 వాహనాలు బిజీ ఉన్న సమయంలో అత్యవసర సమయంలో ప్రైవేటు వాహనాల్లో బాధితులను ఆసుపత్రులకు తరలించాల్సి వస్తుంది. ప్రభుత్వం 108 అంబులెన్స్ కేటాయించాలి.

– ఇలియాస్, పెంచికల్‌పేట్

క్లుప్తంగా

సర్వేపై సబ్ కలెక్టర్ ఆరా..!

సాక్షి స్పందన

బెజ్జూర్: ప్రభుత్వ భూములు కబ్జాకు గురికాకుండా చూడాల్సిన బాధ్యత అధికారులది.. అయితే అధికారులు మాత్రం తమకు ఏమి సంబంధం లేనట్లుగా వ్యవహరిస్తున్నారు. 'సర్వే నామమాత్రమే' అనే శీర్షికన 'సాక్షి'లో గత వారం రోజుల క్రితం ప్రచురితమైన కథనానికి కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ కలెక్టర్ శ్రద్ధా శుక్లా స్పందించారు. దీనిపై ఆరా తీశారు. బెజ్జూర్ మండల కేంద్రంలోని బస్టాండ్, వారసంతా, బట్టల షాప్, మంగళ షాపుల కోసం వదిలిపెట్టిన ప్రభుత్వ భూములకు సంబంధించిన నివేదిక పంపాలని అధికారులను ఆదేశించినట్లు సమాచారం.

ఎస్పీని కలిసిన సీఐ సంపత్


పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలుపుతున్న సీఐ

ఆసిఫాబాద్: ఇటీవల జిల్లాకు బదిలీపై వచ్చిన బండారి సంపత్ సోమవారం ఎస్పీ శ్రీనివాస రావును జిల్లా కేంద్రంలోని ఎస్పీ కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. సీఐ సంపత్ భూపాల్‌పల్లి జిల్లాలో సైబర్ క్రైమ్‌లో ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వర్తించారు.

హామీలు అమలు చేయాలి


ధర్నా చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

పెంచికల్‌పేట్: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని బీఆర్ఎస్ మండల కన్వీనర్ బిట్టి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో సోమవారం రైతుభరోసా నిధులను వెంటనే రైతు ఖాతాల్లో జమ చేయాలని డిమాండ్ చేస్తూ ధర్నా చేపట్టారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం అధికారంలోకి వచ్చి పది నెలలు అవుతున్నా.. ఇప్పటికీ రైతులకు రైతుభరోసా ఇవ్వలేదన్నారు. పెట్టుబడి సాయం లేక రైతులు ఇబ్బంది పడుతున్నారని అన్నారు. ప్రభుత్వ రైతు వ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకువెళ్లి పోరాటం చేస్తామన్నారు.

24న ఇసుక వేలం

సిర్పూర్(టి): మండలంలోని మాకిడి గ్రామ శివారులో అక్రమంగా ఎలాంటి అనుమతి పత్రాలు లేకుండా ఇసుక రవాణా చేసి నిల్వ ఉంచిన ఇసుకకు ఈనెల 24న వేలం వేయనున్నట్లు తహసీల్దార్ శ్రీనివాస్ తెలిపారు. మండల గిర్దావర్ సమక్షంలో ప్రభుత్వ నిబంధనల మేరకు వేలం నిర్వహిస్తామని, ఆసక్తి గల వారు వేలం పాటలో పాల్గొనాలని కోరారు.

లక్కీ డ్రాలు నిర్వహిస్తే కఠిన చర్యలు

తిర్యాణి: మండలంలో లక్కీ డ్రాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్సై మాధవ్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. లక్కీ లాటరీ విధానం నిషేధం ఉందని నిబంధనలను అతిక్రమించి ఎవరైనా లాటరీ నిర్వహిస్తే కేసులు నమెదు చేస్తామని హెచ్చరించారు.

అటవీ అధికారుల వేధింపులు ఆపాలి


వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఆసిఫాబాద్‌అర్బన్: వడ్రంగి కార్మికులపై అటవీశాఖ అధికారుల వేధింపులు ఆపాలని సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు వెలిశాల కృష్ణమాచారి డిమాండ్ చేశారు. ఈ మేరకు జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో సోమవారం వినతిపత్రం అందించారు. ఆయన మాట్లాడుతూ అటవీ అధికారుల వైఖరితో వడ్రంగి కార్మికులు ఉపాధి కోల్పోవాల్సి వస్తోందన్నారు. 50 ఏళ్లు దాటిన వారికి పింఛన్ సౌకర్యం కల్పించాలని, ప్రమాదం సంభవిస్తే రూ.10లక్షల బీమా సౌకర్యం కల్పించాలన్నారు. కార్యక్రమంలో కార్మికులు తులసీరాం, పద్మాకర్, వెంకటేశ్, రాజేశం, నగేశ్, ప్రభాకర్, రాజు, బాబన్, హన్మంతు తదితరులు ఉన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ మంజూరు చేయండి


వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

ఆసిఫాబాద్‌అర్బన్: వాంకిడి మండలం పాటగూడ గ్రామపంచాయతీ పరిధిలోని ఏనోలి కొలాంగూడ గ్రామానికి మిషన్ భగీరథ నీరు సక్రమంగా రావడం లేదని, భీంపూర్ గ్రామంలో హెచ్‌పీ మోటార్‌కు విద్యుత్ సరఫరా కోసం ట్రాన్స్‌ఫార్మర్‌ను మంజూరు చేయాలని సీపీఎం నాయకులు సోమవారం జిల్లా కేంద్రంలో అదనపు కలెక్టర్ దీపక్‌తివారికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి దుర్గం దినకర్ మాట్లాడుతూ.. గ్రామస్తులు తాగునీటి ఇబ్బందులు పడుతున్నారని, చేతి పంపులు కూడా పని చేయడం లేదన్నారు. స్పందించిన అదనపు కలెక్టర్ ప్రత్యేక ట్రాన్స్‌ఫార్మర్‌ను మంజూరు చేసి రెండు రోజుల్లో సమస్య పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో వారిలో వీటీడీఏ వైస్ చైర్మన్ పగ్గు, గ్రామపటేల్ ధర్ము, గ్రామస్తులు భీంరావ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

మొట్లగూడకు బస్సు నడిపించండి

దహెగాం: వర్షాకాలం ప్రారంభ సమయంలో జూన్ నుంచి మొట్లగూడకు బస్సు సేవలు నిలిచిపోయాయి. అప్పటి నుంచి ఇంకా బస్సు సేవలు పునరుద్ధరించలేదు. దీంతో మొట్లగూడ, రాంపూర్, రావులపల్లి, దిగిడ గ్రామాల ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. మండలంలోని కర్జి సమీపంలో ప్లాంటేషన్ వద్ద రహదారి దెబ్బతినడంతో మరమ్మతులు చేసే నాథుడే కరువయ్యాడని ప్రజలు వాపోతున్నారు. మంచిర్యాల డిపోకు చెందిన బస్సు గతంలో మొట్లగూడ వరకు వెళ్లి అక్కడే ఉండి మరునాడు ఉదయం 6 గంటలకు అక్కడి నుంచి బయలుదేరి మంచిర్యాలకు వెళ్లేదన్నారు. వర్షాకాలం ప్రారంభంలో బస్సు రద్దు కావడంతో ప్రైవేట్ వాహనాల్లో ప్రమాదకరంగా ప్రజలు ప్రయాణిస్తున్నారు. రూ. 150 రుపాయలు వెచ్చించాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి మొట్లగూడకు బస్సు నడిపించాలని ప్రజలు కోరుతున్నారు.

పరీక్షలు సజావుగా నిర్వహించాలి


పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న అధికారులు

కౌటాల: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు ఎస్ఏ– 1 పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని ఎంఈవో గావుడే హన్మంతు అన్నారు. సోమవారం కౌటాల జెడ్పీ ఉన్నత పాఠశాలలో పరీక్ష తీరును పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు భయం వీడి పరీక్షలు రాయాలని, పరీక్షల కోసం ప్రిపేర్ కావాలన్నారు. అనంతరం మధ్యాహ్న భోజనం పరిశీలించి మెనూ ప్రకారం భోజనం పెట్టాలన్నారు. ఆయన వెంట ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేట్ ఆసుప్రతులపై చర్యలు తీసుకోవాలి


వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

కౌటాల: రోగుల నుంచి అధిక బిల్లులు వసూలు చేస్తున్న ప్రైవేట్ హాస్పిటల్స్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని ఎన్‌హెచ్ఆర్సీ సభ్యులు శ్యాంరావు, గోవింద్‌రావు స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో అధికారులకు సోమవారం వినతిపత్రం అందించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రైవేట్ ఆసుప్రతులు నిబంధనలకు విరుద్ధంగా అర్హత లేని వైద్యులు, ఫార్మసిస్టులతో కొనసాగిస్తున్నారని, వారి వైద్యంతో ప్రజల ప్రాణాలకు ప్రమాదం పొంచి ఉందన్నారు. పలువురు ప్రభుత్వ వైద్యులు సైతం ప్రైవేట్ ఆస్పత్రులు నిర్వహిస్తున్నారని ఆరోపించారు.

ఆదివాసీ మహిళా కమిటీ ఎన్నిక


ఎన్నికైన సభ్యులు

బెజ్జూర్: మండల కేంద్రంలోని ఆదివాసీ భవనంలో సోమవారం నిర్వహించిన ఎన్నికల్లో బెజ్జూర్ మండల ఆదివాసీ మహిళా మండల కమిటీని ఎన్నుకున్నారు. మండల గౌరవ అధ్యక్షురాలుగా మాజీ జెడ్పీటీసీ పుష్పలత, మాజీ సర్పంచ్ సుగుణ, మండల అధ్యక్షురాలుగా ఎన్క అమృత, ఉపాధ్యక్షురాలుగా ఎలాది యశోద, మాధవి, ప్రధాన కార్యదర్శిగా పోర్తేటి పద్మ, కార్యదర్శులుగా నిర్మల, అమృత, కోశాధికారిగా మాధవి, మమత, ప్రచార కార్యదర్శులుగా లలిత, లక్ష్మి, మలక్కా తదితరులను ఎన్నుకున్నారు.

రక్తదాన శిబిరం

ఆసిఫాబాద్‌రూరల్: పోలీస్ అమరవీరుల దినోత్సవాన్ని పురస్కరించుకొని సోమవారం లింగాపూర్ మండలంలో పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించినట్లు సీఐ రమేశ్ తెలిపారు. 50 మంది పాల్గొని రక్తదానం చేశారు. జిల్లా కేంద్రంలోని శ్రీ చైతన్య డిగ్రీ కళాశాలలో పోలీస్ అమరవీరుల దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు వ్యాస రచన పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో జైనూర్ ఎస్సై ప్రవీణ్, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.


రక్తదానం చేస్తున్న మహిళలు

మృతుడి వివరాలు సేకరణ


వివరాలు సేకరిస్తున్న అధికారులు

బెజ్జూర్: మండలంలోని ఎలుకపల్లి గ్రామానికి చెందిన వదుగురి అంజన్న (17) జ్వరంతో మృతి చెందిన విషయం తెలిసిందే. కాగా సోమవారం మృతుడి కుటుంబాన్ని ఎంపీవో గౌరీ శంకర్ పరామర్శించారు. బెజ్జూర్ గ్రామ పంచాయతీ కార్యదర్శి తుకారాం, ఆశ వర్కర్‌తో కలిసి యువకుని మృతికి గల వివరాలను కుటుంబసభ్యులను అడిగి తెలుసుకున్నారు. ఎంపీవో మాట్లాడుతూ మృతుడి వివరాలను సేకరించి అధికారులకు పంపించడం జరుగుతుందని పేర్కొన్నారు.

రుణాలు సకాలంలో చెల్లించాలి



సమావేశంలో వీవో సభ్యులు

కెరమెరి: తీసుకున్న రుణాలు సకాలంలో చెల్లించాలని ఐకేపీ సీసీ కౌసల్య అన్నారు. సోమవారం మండలంలోని కర్నెతగూడ, రావుజిగూడల్లో వీవో సభ్యులకు నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. బ్యాంకుల ద్వారా కాని స్త్రీనిధి రుణాలు ప్రతీ నెల సకాలంలో చెల్లించాలని, అలా చెల్లిస్తే ఎలాంటి భారం పడదన్నారు. ఒకేసారి రుణాలు చెల్లించాలని అనుకుంటే చెల్లించేందుకు ఇబ్బంది పడాల్సి వస్తుందన్నారు. మళ్లీ రుణాలు కావాలంటే తీసుకున్న రుణాలు చెల్లించాలన్నారు. వీవోఏ శ్రీధర్ పాల్గొన్నారు.

విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలి

ఆసిఫాబాద్‌రూరల్: విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని సోమవారం జిల్లా కేంద్రంలో అదనపు కలెక్టర్ దాసరి వేణుకు ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో వినతిపత్రం అందించారు. ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి తిరుపతి మాట్లాడుతూ జిల్లా కేంద్రంలో ఎస్సీ బాలుర పోస్ట్ మెట్రిక్, ప్రీమెట్రిక్ విద్యార్థులకు ఒకే భవనంలో వసతి కల్పించారని తెలిపారు. మూడు రూంల్లో 70 మంది విద్యార్థులకు స్థలం సరిపోక ఇబ్బంది పడుతున్నారన్నారు. వేర్వేరుగా వసతి కల్పించాలని కోరారు. అలాగే హాస్టల్‌లో కుక్ బదిలీపై వెళ్లి రెండు నెలలు గడిచినా కొత్తవారిని నియమించకపోవడంతో వాచ్‌మెన్ వంట చేస్తున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో విలాస్ తదితరులు ఉన్నారు.

శనగ విత్తనాల పంపిణీ


విత్తనాలు పంపిణీ చేస్తున్న అధికారులు

కౌటాల: మండల కేంద్రంలోని గురుడుపేట ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యాలయంలో సోమవారం రైతులకు శనగ విత్తనాలను డీసీఎంఎస్ వైస్ చైర్మన్ కుమురం మాంతయ్య పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సహకార సంఘంలో రైతులకు 50 క్వింటాళ్ల శనగ విత్తనాలు అందుబాటులో ఉన్నాయన్నారు. మండలంలోని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. 25కిలోల శనగ బస్తా రూ. 2250 ధర ఉందని, రైతులు తమ ఆధార్‌కార్డు జిరాక్స్ వెంట తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సీఈవో బి. రాజేశ్, కౌటాల ఏఈవో ఘనశ్యాం, తదితరులు పాల్గొన్నారు.

పరిహారం అందించి ఆదుకోవాలి


వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

కౌటాల: రైలు ఢీ కొట్టి గొర్రెలు మృతి చెందిన ఘటనలో బాధిత రైతును ప్రభుత్వం పరిహారం అందించి ఆదుకోవాలని యాదవ సంఘం నాయకులు కోరారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ శీర్షా గ్రామానికి చెందిన జడ భీమయ్య అనే రైతు 180 గొర్రెలు, 10 మేకలు రైలు ప్రమాదంలో మృతి చెందాయన్నారు. రైతుకు రూ. 16 లక్షల నష్టం జరిగిందని, ప్రభుత్వం న్యాయం చేయాలన్నారు. కార్యక్రమంలో యాదవ సంఘం మండలాధ్యక్షుడు బట్టమేకల గట్టయ్య, భీమయ్య, శ్రీశైలం, పోచయ్య, శ్రీనాథ్, తదితరులు పాల్గొన్నారు.

పశువులకు గాలికుంటు నివారణ టీకాలు


లోడుపల్లిలో టీకా వేస్తున్న పశువైద్యాధికారి రాకేశ్


టీకా వేస్తున్న పశువైద్యాధికారి శ్రీకాంత్

పెంచికల్‌పేట్: మండలంలోని లోడుపల్లి గ్రామంలో పశువులకు పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ఉచిత గాలికుంటు టీకాలు పశువైద్యాధికారి రాకేశ్ వేశారు. పశువుల యజమానులు పశువుల్లో వచ్చే గాలికుంటు వ్యాధిని అరికట్టడానికి ప్రతిఒక్కరూ టీకాలు వేయించాలని సూచించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ జాజిమొగ్గ శ్రీనివాస్, పశువైద్య సిబ్బంది సురేశ్, ఆనందరావు, శివ, శేఖర్, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

కౌటాల: మండలంలోని అన్ని గ్రామాల్లో పశువులకు నెల రోజుల పాటు గాలికుంటు నివారణ టీకాలు వేస్తామని కౌటాల పశువైద్యాధికారి ఎస్ శ్రీకాంత్ అన్నారు. సోమవారం మండలంలోని బోదంపల్లి గ్రామంలోని పశువులకు గాలికుంటు నివారణ టీకాలు వేశారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది సందీప్, సత్యనారాయణ, భిక్షపతి, శోభన్, తదితరులు పాల్గొన్నారు.

జీతాలు వెంటనే చెల్లించాలి


వినతిపత్రం అందిస్తున్న పంచాయతీ కార్మికులు

కౌటాల: పెండింగ్‌లో ఉన్న తమ జీతాలను ప్రభుత్వం వెంటనే చెల్లించాలని సోమవారం మండలంలోని పంచాయతీ కార్మికులు ఎంపీడీవో కార్యాలయంలో అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. నెలల తరబడి జీతాలు పెండింగ్‌లో ఉండడంతో కుటుంబ పోషణ భారంగా మారిందన్నారు. జీతాలు చెల్లించకుంటే ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో కార్మికులు పాల్గొన్నారు.

ప్రజల భద్రతే ధ్యేయం


వాలీబాల్ కిట్ అందజేస్తున్న ఎస్సై మధుకర్

కౌటాల: ప్రజల భద్రతే పోలీసుల ధ్యేయమని ఎస్సై మధుకర్ అన్నారు. పోలీస్ అమర వీరుల దినోత్సవం సందర్భంగా సోమవారం కౌటాల ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు వాలీబాల్ కిట్ అందజేశారు. అనంతరం మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. శాంతి భద్రతల పరిరక్షణ కోసం ఎంతో మంది పోలీసులు తమ విలువైన ప్రాణాలు కోల్పోయారని గుర్తుచేశారు. పోలీస్ అమరవీరుల త్యాగాలను మర్చిపోవద్దన్నారు. సమాజంలో శాంతి భద్రతలను కాపాడేందుకు నిరంతరం కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు ఆంజనేయులు, మోతిలాల్ నాయక్, ప్రకాశ్, రాంబాబు, పాపయ్య, తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ నాయకుల ధర్నా


నిరసన తెలుపుతున్న బీఆర్ఎస్ నాయకులు

సిర్పూర్(టి): కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీల మేరకు రైతుబంధు, రైతుబీమా పథకాల అమలుతో పాటు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రంలోని బస్టాండ్ ప్రాంతంలో సిర్పూర్ (టి)– కాగజ్‌నగర్ ప్రధాన రహదారిపై ధర్నా చేపట్టారు. ఈసందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. హామీలు నెరవేర్చకుండా ప్రజలను మభ్యపెట్టడమే కాకుండా ఇబ్బందులకు గురి చేస్తుందని ఆరోపించారు. ప్రజలకు బీఆర్ఎస్ అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో నాయకులు అస్లం బిన్ అబ్దుల్లా, లక్ష్మణ్, రాజేష్, ఎల్ములే నందాజీ, షేక్ చాంద్, సంతోష్, జెల్ల రాజేష్, అజ్మీరా ప్రకాష్, రవివర్మ, భీంరావ్, సునీల్, గౌతమ్, రాజశేఖర్, భారత్, అమీర్, సంతోష్ పాల్గొన్నారు.

ఘనంగా ఎంపీ జన్మదిన వేడుకలు


కేక్‌కట్ చేస్తున్న బీజేపీ నాయకులు

ఆసిఫాబాద్‌అర్బన్: ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఎంపీ, బీజేపి నాయకులు గోడం నగేశ్ జన్మదిన వేడుకలను సోమవారం జిల్లా కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. కేక్‌కట్ చేసి, స్వీట్లు పంచిపెట్టారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు అరిగెల నాగేశ్వర్ రావ్, మాజీ ఎంపీపీ మల్లికార్జున్, ఖాండ్రె విశాల్, మాటూరి జయరాజ్, ప్రసాద్, వెంకన్న, ప్రహ్లాద్, సురేశ్, మహేశ్, సంజీవ్, సత్యనారాయణ, సంతోష్ పాల్గొన్నారు.

పద్మశాలి కార్యవర్గం

ఆసిఫాబాద్‌అర్బన్: ఆసిఫాబాద్ పట్టణ పద్మశాలి సంఘం అధ్యక్షుడిగా అనుమండ్ల శ్రీకాంత్, ప్రధాన కార్యదర్శిగా అల్లె శ్రీకాంత్ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు సోమవారం ఎన్నికల నిర్వాహణ సభ్యులు చెన్నూరి ప్రకాష్, మధుకర్, రవీందర్‌లు తెలిపారు. సోమవారం ఎన్నికల ప్రణాళికలో భాగంగా కోమటిపల్లి లింగయ్య, జంజిరాల సంజీవ్ తమ నామినేషన్‌లను ఉపసంహరించుకోవడంతో అధ్యక్ష, ప్రధాన కార్యదర్శుల ఎన్నిక ఏకగ్రీవం అయినట్లు పేర్కొన్నారు.

భక్తిశ్రద్ధలతో బాబా జయంతి వేడుకలు

కౌటాల: మండలంలోని వీర్దండి, గుండాయిపేట గ్రామాల్లో సోమవారం జగద్గురు నరేంద్ర మహరాజ్ బాబా జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. గుండాయిపేట గ్రామంలోని నరేంద్ర బాబా ఆలయంలో భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం గ్రామంలోని ప్రధాన వీధుల్లో బాబా పల్లకీని ఊరేగించారు. కమిటీ సభ్యులు భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

పేకాట స్థావరంపై పోలీసుల దాడి

వాంకిడి: మండలంలోని సరాండి గ్రామ శివారులో గుట్టుచప్పుడు కాకుండా నిర్వహిస్తున్న పేకాట స్థావరంపై సోమవారం సాయంత్రం పోలీసులు దాడి చేశారు. పేకాట ఆడుతున్న నలుగురిని అదుపులోకి తీసుకోగా.. మరొకరు పారిపోయినట్లు ఎస్సై ప్రశాంత్ తెలిపారు. రూ.5500 నగదు సీజ్ చేసి, ఐదుగురిపై కేసు నమోదు చేశామని పేర్కొన్నారు.